సాక్షి
ఖమ్మం
బుధవారం । 27 । ఆగస్టు । 2025

జిల్లావ్యాప్తంగా గణేష్ నవరాత్రుల సందడి మొదలైంది. చిన్నాపెద్ద తేడా లేకుండా ఉత్సవాలకు సిద్ధం కాగా ఊరూవాడ మండపాలు ఏర్పాటుచేశారు. ముందస్తుగా విగ్రహాలను బుక్ చేసుకున్న వారు మంగళవారం సాయంత్రం నుంచి ప్రతిమలను మండపాలకు చేర్చారు. విగ్రహాలు, పూజాసామగ్రి అమ్మకాలు, కొనుగోళ్లతో జిల్లా కేంద్రంతో పాటు పట్టణాల్లోని ప్రధాన వీధులు రద్దీగా కనిపించాయి.



వ్యాపారుల బకాయిలపై ఆరా

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కేంద్రంగా వ్యాపారం నిర్వహిస్తూ పన్ను బకాయి పడిన వారిపై అధికారులు దృష్టి సారించారు. 10లో

గరిష్టం / కనిష్టం
28° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం కనిష్ట స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మాజీ సైనికులకు సైతం ప్రభుత్వ పథకాలు



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జిల్లా జడ్జి ఉమాదేవి

ఖమ్మంలీగల్: మాజీ సైనికులకు అన్ని ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.శ్యామ్‌కోషి తెలిపారు. ఖమ్మంలో ఏర్పాటుచేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్‌లో మంగళవారం ఆయన ప్రారంభించగా, జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కె.ఉమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ క్లినిక్‌ను మాజీ సైనిక ఉద్యోగులు, వారి కుటుంబాల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ సైనికులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి ఉమాదేవి మాట్లాడగా క్లినిక్‌లో న్యాయవాదిగా జి.అమర్‌నాథ్, పారాలీగల్ వలంటీర్‌గా మహబూబ్ సుబానీని నియమించారు. న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి కల్పన, డిఫెన్స్ కౌన్సిల్ బి.శ్రీనివాస్, న్యాయవాదులు పాల్గొన్నారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువకులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు ఐటీడీఏ ఆధ్వర్యాన పీఓ బి.రాహుల్ తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జీ నంబర్ కలిగిన నిరుద్యోగ యువత జిరాక్స్ సర్టిఫికెట్లతో ఐటీడీఏలోని భవిత విభాగంలో సెప్టెంబర్ 1వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వరంగల్‌లో ఇచ్చే శిక్షణ సమయాన ఉచిత వసతి ఉంటుందని తెలిపారు. వివరాలకు 63026 08905, 90638 89994 నంబర్లలో సంప్రదించాలని పీఓ సూచించారు.

టీఎల్‌ఎంతో అర్థమయ్యేలా బోధన



మేళాను ప్రారంభిస్తున్న డీడీ విజయలక్ష్మి

ఖమ్మంరూరల్: బోధన అభ్యసన సామగ్రి(టీఎల్‌ఎం) వినియోగంతో బోధన సులువు కావడంతో పాటు విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటారని గిరిజన సంక్షేమ శాఖ డీడీ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని గొల్లగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన టీఎల్‌ఎం మేళానుమంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్య, ఉత్తమ ఫలితాలకు కేరాఫ్‌గా మార్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉద్దీపకం వర్క్ బుక్–1పై పరీక్షలో నానూనగర్ తండా, గోవింద్రాల పాఠశాల విద్యార్థులు మొదటి రెండు స్థానాల్లో నిలిచారని తెలిపారు. ఏటీడీఓ సత్యవతి, హెచ్‌ఎం ఆర్.శ్యామ్, ఉద్యోగులు భారతి, బాలా, ప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏషియన్ ఓపెన్ ఐస్ స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ



సాధించిన పతకాలతో నయనశ్రీ

బోనకల్: బోనకల్ మండలం మోటమర్రి గ్రామానికి చెందిన తాళ్లూరి నయనశ్రీ ఏషియన్ ఓపెన్ ఐస్ స్కేటింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈనెల 20నుంచి 23 వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన పోటీల్లో 500, 1,500 మీటర్ల విభాగంలో కాంస్య పతకాలు, 1000 మీటర్ల విభాగం, మహిళల రిలే విభాగంలో రజత పతకాలు సాధించింది. గత జూన్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన నయనశ్రీ, ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో 17 పతకాలు గెలుచుకోవడం విశేషం. ఈ ఏడాది నవంబర్‌లో కజకిస్తాన్‌లో జరగనున్న వరల్డ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన ఆమె ప్రస్తుతం బెంగుళూరులో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆరో ఏట నుంచే స్కేటింగ్‌లో రాణిస్తున్న నయనశ్రీని పలువురు అభినందించారు.



పెవిలియన్ మైదానం వద్ద పత్రి కొనుగోలు చేస్తున్న నగరవాసులు

గణేష్ నవరాత్రుల శోభ



ఖమ్మం నుంచి వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న ఉత్సవ సమితి బాధ్యులు

ఇక సమరమే !?

- వచ్చేనెల 2న ఓటర్ల తుది జాబితా
- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- స్థానిక సంస్థల ఎన్నికలకు ఒక్కటొక్కటిగా ఏర్పాట్లు



ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఒక్కటొక్కటిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఓటర్ల తుది జాబితా ప్రకటన షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో త్వరలో ఎన్నికలు జరిగే అవకాశముందన్న ప్రచారం మొదలైంది.

ఈనెల 28న ముసాయిదా

జిల్లాలోని 20 మండలాల్లో 571 గ్రామపంచాయతీలకు గాను 5,214 వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 8,02,690మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,88,244, మహిళలు 4,14,424, ఇతరులు 22మంది ఉన్నట్లు ఈ ఏడాది జూలై 1న విడుదల చేసిన జాబితా ద్వారా వెల్లడైంది. అయితే, మార్పులు, చేర్పుల అనంతరం తుది ఓటర్ల జాబితా విడుదలపై ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఇందులో భాగంగా ఈనెల 28వ తేదీన అన్ని గ్రామపంచాయతీల్లో ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటించాల్సి ఉంటుది. జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యాన ఈనెల 29న రాజకీయ పార్టీల నాయకులతో, 30వ తేదీన మండల స్థాయిలో ఎంపీడీఓలు సమావేశాలు నిర్వహించాలి. ఆపై ఓటర్ల జాబితా, వార్డుల విభజనపై ఈనెల 28నుంచి 30వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆతర్వాత 31వ తేదీన అభ్యంతరాలను పరిష్కరించి, సెప్టెంబర్ 2వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్నారు.

నూతనోత్సాహం

గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయోనని ఆశావహులు ఎదురుచూపుల్లో ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేక ఎన్నికల నిర్వహణ ఆలస్యమవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యాన రాష్ట్రప్రభుత్వం కాంగ్రెస్ తరఫున రిజర్వేషన్ల అమలుపై ప్రకటన చేసింది. ఇంతలోనే ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితా ప్రకటనపై షెడ్యూల్ విడుదల చేయడంతో ఆశావహుల్లో ఒక్కసారిగా ఉత్సాహం మొదలైంది. వచ్చేనెల 2న ఓటర్ల తుది జాబితా విడుదలయ్యాక ఎప్పుడైనా ఎన్నికల షెడ్యూల్ విడుదల కావొచ్చని భావిస్తున్నారు. అంతేకాక వచ్చేనెల 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆదేశాలు ఉండడంతో త్వరలోనే షెడ్యూల్ వస్తుందనే భావనతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సిద్ధంగా యంత్రాంగం

జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. ఇప్పటికే జిల్లాలో ఉన్న బ్యాలెట్ బ్యాక్స్‌లకు తోడు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 3,500బాక్స్‌లు తెప్పించారు. అంతేకాక ఇతర సామగ్రి సమకూర్చుకున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఉద్యోగులతో నివేదికలు సిద్ధం చేశారు.

మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న 'సాక్షి' మీడియా గ్రూప్, స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు



పర్యావరణ హితమే లక్ష్యం

- మట్టి విగ్రహాల వినియోగంతో ఇది సాధ్యం
- మట్టి ప్రతిమల పంపిణీలో వక్తలు
- 'సాక్షి', స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యాన పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా 'సాక్షి' మీడియా గ్రూప్, స్తంభాద్రి ఉత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యాన మంగళవారం మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఖమ్మం పెవిలియన్ మైదానం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విగ్రహాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ లాహోటి, కీసర జయపాల్‌రెడ్డి, కార్యనిర్వహాక అధ్యక్షుడు గెంటేల విద్యాసాగర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అల్లిక అంజయ్య మాట్లాడారు. అందరికీ ప్రీతిపాత్రమైన వినాయక చవితి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకునేలా మట్టి ప్రతిమలు ప్రతిష్ఠించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల నిమజ్జనంతో నీరు కాలుష్యం కావడమే కాక జలరాశుల మనుగడ దెబ్బతింటుందన్నారు. ఏటా మండపాలు పెరుగుతున్నందున మట్టి విగ్రహాలతో ఉత్సవాలు జరుపుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి బాధ్యులు మూలగుండ్ల శ్రీహరి, నూకల మోహన్ కృష్ణ, జమ్మి శ్రవణ్‌కుమార్, బోయినపల్లి కోటిరెడ్డితో పాటు 'సాక్షి' బ్యూరో ఇన్‌చార్జి బొల్లం శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ జి.మోహన్‌కృష్ణ, సాక్షి టీవీ ప్రతినిధి పసునూరి మహేందర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజుతో పాటు జి.జవహర్‌రెడ్డి, జె.ఉపేందర్, సతీష్, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

12ఏళ్లుగా ప్రోత్సాహం



పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నాం. గణపతి పూజకు ప్రాధాన్యత ఇస్తూనే పర్యావరణ రక్షణ బాధ్యత అందరిపై ఉంది. గత 33 ఏళ్లుగా సమితి ఆధ్వర్యాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, 12ఏళ్లుగా మట్టి ప్రతిమలను ప్రోత్సహిస్తున్నాం. – వినోద్ లాహోటి, స్తంభాద్రి ఉత్సవ సమితి అధ్యక్షుడు

అవగాహన పెంపొందించాలి



మట్టి విగ్రహాల వాడకంపై అవగాహనకు విద్యావంతులు, పర్యావరణవేత్తలు, యువత ముందుకు రావాలి. అంతా కలిసి మండప నిర్వాహకుల్లో చైతన్యం తీసుకొస్తే మంచి ఫలితాలు వస్తాయి. గతంతో పోలిస్తే మట్టి విగ్రహాల ప్రతిష్ఠాపన పెరుగుతోంది. – గెంటేల విద్యాసాగర్, ఉత్సవ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు

జలరాశులకు ప్రయోజనం



పీఓపీతో చేసే విగ్రహాలతో అనర్థాలను గుర్తించి జలరాశుల పరిరక్షణకు అంతా నడుం బిగించాలి. నవధాన్యాలతో తయారుచేసే మట్టి విగ్రహాలను పూజ తర్వాత నిమజ్జనం చేస్తే జలరాశులకు ప్రయోజనం ఉంటుంది. జలాశయాల వెంట పచ్చదనం పెరుగుతుంది. – కీసర జయపాల్‌రెడ్డి, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి

వినాయక ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

పోలీస్ అధికారుల సమీక్షలో సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజాభద్రతకు ప్రాధాన్యత ఇస్తూనే ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా అధికారులు కృషి చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన నేరసమీక్ష సమావేశంలో సీపీ మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలు నిమజ్జనం వరకు చిన్న పొరపాటు సైతం జరగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మండపాల సమీపాన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తూ అత్యవసర పరిస్థితుల్లో స్పందించడానికి సన్నద్ధమై ఉండాలని చెప్పారు. కాగా, రాత్రి వేళ పెట్రోలింగ్ మరింత పెంచాలని, కేసుల దర్యాప్తులో డివిజన్ స్థాయి అధికారులు సమీక్షిస్తూ కోర్టుల్లో చార్జిషీట్లు సకాలంలో దాఖలు చేయాలని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టాలని స్పష్టం చేశారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రెహమాన్, రఘు, సాంబరాజు, మహేష్, సర్వర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



డ్రోన్ శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం అర్బన్: మహిళలు లాభసాటి వ్యాపారాలపై దృష్టి సారించి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని, ఇందుకోసం అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ఖమ్మం టేకులపల్లిలోని మహిళా ప్రాంగణాన్ని మంగళవారం సందర్శించిన ఆయన ఉపాధి శిక్షణ తరగతుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో అందిస్తున్న డ్రోన్ పైలెట్ శిక్షణను పరిశీలించాక మాట్లాడారు. వయస్సుతో సంబంధం లేకుండా మహిళలు శిక్షణ తీసుకుంటుండడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగం పెరుగుతున్నందున శిక్షణ పొందిన మహిళలకు మంచి ఉపాధి లభిస్తుందని తెలిపారు. డ్రోన్ ఆపరేటర్‌గా రోజుకు రూ.15 వేల మేర సంపాదించే అవకాశముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత, ఉద్యోగులు సరస్వతి, స్పందన, మల్లిక, విజయ్ కుమార్, సుధీర్, సుకన్య, మౌనిక, లాలయ్య, జయ, శారద, అనిత, దుర్గారావు, శాంతమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



వీధుల్లో పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

ఏన్కూరు: వర్షాల నేపథ్యాన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. ఏన్కూరు పీహెచ్‌సీ, ఆరోగ్య ఉపకేంద్రంతో పాటు హరిజనవాడ ప్రాథమిక పాఠశాల, ఎంపీడీఓ, జీపీ కార్యాలయాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. అలాగే, మండల కేంద్రంలోని పలు వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, జ్వరాల కేసులు, నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి సూచనలు చేశారు. ఎంపీడీఓ జీవీఎస్.నారాయణ, వైద్య, ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవ్యతిరేకం

ఖమ్మంవైద్యవిభాగం: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం జరగగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ స్కానింగ్ కేంద్రాల్లో చేసే అన్ని పరీక్షల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు చేసిన, చేయించుకున్న వారికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా ఉంటుందని తెలిపారు. కాగా, లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టటానికి ప్రతీనెల స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీ చేస్తామని వెల్లడించారు. అలాగే, జిల్లా సంక్షేమ శాఖ ద్వారా ఆడపిల్ల పుట్టడం అదృష్టంగా భావించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, పీఓలు చందునాయక్, పి.వెంకటరమణ, ఉద్యోగులు కె.శ్రీనివాసరావు, ఎస్‌డీ.సత్రీమ్, ఎన్‌జీఓ ప్రతినిధి కుముదిని తదితరులు పాల్గొన్నారు.

209మందికి పదోన్నతి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ఉపాధ్యాయుల (ఎస్‌జీటీ)కు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ ముగిసింది. ఈమేరకు జిల్లాలో 209మందికి పదోన్నతులు లభించాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉత్తర్వులు జారీ చేయగా, వీరు వెంటనే నూతన స్థానాల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

240మంది చిన్నారులకు వైద్యపరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం, ఆలింకో సంస్థ ఆధ్వర్యాన దివ్యాంగులైన చిన్నారులకు ఉపకరణాలు అందించేందుకు ఖమ్మం నయాబజార్ పాఠశాలలో మంగళవారం శిబిరాన్ని నిర్వహించారు. జిల్లాలో 18ఏళ్లలోపు దివ్యాంగ చిన్నారులకు ఉచితంగా ఉపకరణాలు అందజేయనుండగా, తొమ్మిది మండలాల నుంచి 240మంది హాజరయ్యారని విద్యాశాఖ సీఎంఓ బాజోజు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మిగిలిన మండలాల వారికి ఈనెల 28, 29వ తేదీల్లో వీఎం.బంజర, వైరాలో క్యాంపులు నిర్వహిస్తామని వెల్లడించారు. డీఎస్ఓ జగదీశ్వర్, ఎంఈఓ శైలజాలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉషారాణి, వైద్యురాలు ప్రియావర్మ, స్పెషల్ ఎడ్యుకేటర్లు మహేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాన

ఖమ్మంవ్యవసాయం: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. ఈ ప్రభావం రెండు రోజుల పాటు ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 32.3 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, మిగతా చోట్ల ప్రభావం కనిపించింది.

పెసర రైతులకు నష్టం

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో మంగళవారం ఎడతెరిపి లేని వర్షం కురవడంతో పెసర చేలపై ప్రభావం పడింది. మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో పెసర సాగవుతుండగా ఈనెల మొదటి వారంలో తుఫాన్ ప్రభావంతో చేన్లు దెబ్బతిన్నాయి. ఆపై వారం రోజులుగా ఎండ రావడంతో ఆగమేఘాలపై కోతలు మొదలుపెట్టారు. కానీ సగానికి పైగా తాలుగా మారడంతో పెట్టుబడులైనా వస్తాయని భావించారు. ఇంతలోనే మంగళవారం కురిసిన వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లింది.

పంటల నమోదుకు సిద్ధం

- మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు
- వరి రకాల గుర్తింపు తప్పనిసరి



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగవుతున్న పంటల నమోదు(క్రాప్ బుకింగ్)పై విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. వ్యవసాయ విస్తర్ణాధికారులు(ఏఈఓలు) క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి మొబైల్ యాప్‌లో ఫొటో సహా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఏఈఓల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లాలోని 21 మండలాల పరిధి 129 క్లస్టర్లలో సాగవుతున్న పంటలను నమోదు చేశాక, రైతులకు ఎస్‌ఎంఎస్ ద్వారా వివరాలు పంపిస్తారు. ఈ ఏడాది అక్టోబర్ 25 నాటికి క్రాప్ బుకింగ్ పూర్తి చేసి అక్టోబర్ 27న గ్రామపంచాయతీల్లో వివరాలు ప్రదర్శించాల్సి ఉంది. అందులో తప్పులు ఉంటే నవంబర్ 1వరకు దరఖాస్తులు స్వీకరించి సరిచేశాక తుది జాబితాను నవంబర్ 5న ప్రదర్శిస్తారు.

వివరాల సేకరణ ఇలా...

ప్రతీ ఏఈఓ క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించాక మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలి. మహిళా ఏఈఓలు కనీసం 1,800 ఎకరాల్లో, పురుషులైతే 2వేల ఎకరాల్లో డిజిటల్ క్రాప్ సర్వే చేయాలి. మిగిలిన విస్తీర్ణానికి సంబంధించి సాధారణ పద్ధతిలో నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాక వరి రకాల వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. సన్నధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తున్నందున కొనుగోలు సమయాన సులువయ్యేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక డిజిటల్ బుకింగ్ కోసం ఎక్కువ విస్తీర్ణం ఉన్న గ్రామాన్ని ఎంపిక చేయాలి. కాగా, రైతు పేరు, ఆధార్, మొబైల్ నంబర్ తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

నిర్దేశిత విధానంలో నమోదు

పంట నమోదును నిబంధనల మేరకు నిర్దేశిత విధానంలో చేపట్టాలి. గడువులోగా ప్రక్రియను పూర్తి చేసి జాబితా ప్రదర్శించేలా ఏఈఓలకు అవగాహన కల్పించాం. క్షేత్రస్థాయిలో పరిశీలించాకే మొబైల్ యాప్ ద్వారా ఏఈఓలు వివరాలు నమోదు చేయాలి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



నిల్వలపై ఆరా తీస్తున్న డీఏఓ పుల్లయ్య

తల్లాడ: మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తనిఖీ చేశారు. తల్లాడ, మిట్టపల్లి తదితర గ్రామాల్లో తనిఖీ చేసిన ఆయన యూరియా, ఇతర ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం విక్రయాలు చేపడుతూ అన్ని వివరాలు నమోదు చేయాలని వ్యాపారులకు సూచించా రు. ఏఓ ఎండీ.తాజుద్దీన్, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



నారాయణను సన్మానిస్తున్న అధ్యాపకులు

ఖమ్మం రాపర్తినగర్: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకునేలా ఎన్ఎస్ఎస్ ఉపకరిస్తుందని కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ తెలిపారు. ఖమ్మం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ద్వారా సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, నవ సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవచ్చని తెలిపారు. ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు మాట్లాడగా ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ప్రోగ్రామ్ అధికారులుగా పి.చంద్రకళ, జి.వెంకటేశ్వర్లును నియమించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజ్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాపారుల పన్ను బకాయిలపై ఆరా

ఒకటికి మించి లైసెన్సు ఉంటే వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని కొందరు వ్యాపారులు పన్ను ఎగవేసేలా వ్యవహరిస్తున్న తీరుపై అధికారులు దృష్టి సారించారు. ఈ విషయమై సోమవారం 'సాక్షి'లో 'పన్నుల ఎగవేతకు అడ్డదారులు' శీర్షికన వచ్చిన కథనంతో స్పందించిన అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్రంలోనే ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నుంచి పంట ఉత్పత్తులను వివిధ రాష్ట్రాలకే కాక విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఏటా రూ.వేల కోట్ల విలువైన పంటల ఎగుమతులు జరుగుతుండగా.. వ్యాపారులు మార్కెట్‌కే కాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్దేశిత పన్నులు చెల్లించాలి. కానీ కొందరు నకిలీ పర్మిట్లతో పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నారు. ఈ విషయమై తాజాగా ఓ వ్యాపారిపై పోలీసు కేసు నమోదైంది. కొందరు నకిలీ పర్మిట్లు సృష్టిస్తుండగా, ఇంకొందరు ఒకే కుటుంబంలో నాలుగైదు లైసెన్సులను తీసుకుని రూ.కోట్ల వ్యాపారం చేస్తూ పన్ను ఎగ్గొట్టి, ఒకటి రద్దయినా ఇంకొకటి ఉపయోగిస్తున్నారు. ఇలా ఖమ్మం మార్కెట్‌లో 10 – 15 మంది వ్యాపారులు ఉన్నట్లు తెలుస్తుండగా రాజకీయ నాయకులుగా చెలామణి అవుతూ మార్కెట్‌కు రూ.2.50 కోట్ల మేర బకాయి పడ్డారు. ఈ మేరకు అధికారులు వ్యాపారుల లైసెన్సులను పరిశీలిస్తూనే, ఒకే కుటుంబంలో రెండుకు మించి ఉన్న లైసెన్సులపై ఆరా తీస్తున్నారు. అంతేకాక మార్కెట్ ఫీజు బకాయి పడిన వారి జాబితాను తయారుచేసి చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. తొలుత వ్యాపారులకు నోటీసులు జారీ చేసి వారి నుంచి వచ్చే సమాధానం ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

ఉపాధ్యాయుడికి ఆరు నెలల జైలు

చెల్లని చెక్కు కేసులో కోర్టు తీర్పు

సత్తుపల్లి: చెల్లని చెక్కు జారీ కేసులో ఓ ఉపాధ్యాయుడికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీనివాసరావు మంగళవారం తీర్పు వెలువరించారు. కల్లూరు మండలం ముచ్చరం గ్రామానికి చెందిన ముదిగొండ్ల రామనర్సింహారావు వద్ద ఖమ్మంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బూరుగు జయరాజు 2015లో రూ.8.50 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆరు నెలల తర్వాత రూ.9.10 లక్షలకు చెక్కు ఇచ్చినా ఆయన ఖాతాలో నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో సత్తుపల్లి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కోర్టులో నాయవాది పిన్నం జానకీరామారావు ద్వారా కేసు దాఖలు చేయగా, జయరాజుకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.9.10 లక్షల పరిహారం చెల్లించాలని తీర్పు వచ్చింది. కానీ ఆయన దీనిపై పైకోర్టుకు అప్పీల్ చేశారు. ఈమేరకు విచారణ అనంతరం ఆరో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు కింది కోర్టు తీర్పునే ఖరారు చేస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు.

లారీ ఢీకొని క్లీనర్ మృతి

ఖమ్మంక్రైం: లారీ నుంచి కిందకు దిగిన క్లీనర్ సైడ్ చెబుతున్న క్రమాన అదే లారీ ఢీకొనడంతో మృత్యువాత పడ్డాడు. రంగారెడ్డి జిల్లా ఆరుట్ల గ్రామానికి చెందిన చిందం శ్రీశైలం(50) లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. తుర్కపల్లి నుంచి యూరియా లోడ్ తీసుకుని, డ్రైవర్‌తో పాటు మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఈక్రమాన రాపర్తినగర్ బైపాస్ వద్ద శ్రీశైలం కిందకు దిగి సైడ్ చూపిస్తుండగా డ్రైవర్ ఇస్తారి అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనకు ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై శ్రీశైలం భార్య అనురాధ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం టూ టౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.

విగ్రహాల తరలింపునకు అనుగుణంగా లైన్ల మార్పిడి



ముదిగొండ : వెంకటాపురం గ్రామస్తులు, ఉద్యోగులతో ఎస్ఈ శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: వినాయక ఉత్సవాల నేపథ్యాన విగ్రహాల తరలింపు సమయాన ఆటంకాలు ఎదురుకాకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో పలుచోట్ల కిందకు ఉన్న లైన్లను మంగళవారం సరిచేశారు. ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి పర్యవేక్షణలో బ్రాహ్మణబజార్, ఖిలారోడ్డు తదితర ప్రాంతాల్లో లైన్లను సరిచేయడంతో పాటు గణపతి మండపాల నిర్వాహకులకు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

● **ముదిగొండ:** ముదిగొండ మండలం వెంకటాపురం ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇళ్ల పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ లైన్లను మార్చేలా స్తంభాలు వేయడానికి విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం మార్కింగ్ చేశారు. ఈ విషయమై కొందరు అభ్యంతరం వ్యక్తం చేయగా ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈ నాగేశ్వరరావు, నేషనల్ హైవే డీఈ హరికృష్ణ ఆర్అండ్‌బీ డీఈ చంద్రశేఖర్ వారితో చర్చించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా లైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏఈలు మేకపోతుల శ్రీనివాస్, గోపి, చైతన్య, ఆర్ఐ కల్యాణి పాల్గొన్నారు.

'మోదీ పాలన దేశానికి ప్రమాదకరం'



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్/వైరా: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వాన కొనసాగుతున్న పాలన దేశానికి ప్రమాదంగా మారిందని, ఆయన ప్రపంచ పటంలో దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో రైల్వే, రక్షణ, విద్య, వైద్య, బీమా రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడమే కాక కార్మిక చట్టాల సవరణ ద్వారా వారి హక్కులను కాలరాశారని ఆరోపించారు. కాగా, దేశవ్యాప్త కులగణనను కేంద్రప్రభుత్వం వ్యతిరేకిస్తుంటే, కులగణన, రిజర్వేషన్లకు అనుకూలంగా రాష్ట్రంలో బీజేపీ నాయకులు వ్యాఖ్యలు చేస్తుండడం గర్హనీయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు దొంగల తిరుపతిరావు, శ్రీనివాసరావు, ఎంఏ.జబ్బర్, ఎస్‌కే.మీరా సాహెబ్, ఎస్.నవీన్‌రెడ్డి, బోడపట్ల సుదర్శన్, ఎస్‌కే.నాగుల్‌మీరా, పి.నాగసులోచన పాల్గొన్నారు. కాగా, వైరాలో జరిగిన సీపీఎం డివిజన్ కమిటీ సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల ఇక్కట్లకు కేంద్రప్రభుత్వమే కారణమని విమర్శించారు. రైతులకు అవసరమైన యూరియా అందే వరకు కార్యకర్తలు ఉద్యమించడమే కాక రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, దొంతబోయిన నాగేశ్వరరావు, కె.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరిపై పీడీ యాక్ట్

కూసుమంచి: గంజాయి రవాణాకు పాల్పడిన ఇద్దరిపై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. కూసుమంచి మండలం చేగొమ్మ క్రాస్ వద్ద ఫిబ్రవరి 24న వాహనాల తనిఖీ చేస్తుండగా కారులో తరలిస్తున్న 179కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులైన సిద్దిపేట జిల్లా మందపల్లికి చెందిన పల్లపు రఘు, నల్లగొండ జిల్లా వెంకటాద్రిపాలెంకు చెందిన మహ్మద్ ఖాజా పాషాను చంచల్‌గూడ జైలుకు తరలించారు. వీరిపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ పత్రాలను కూసుమంచి సీఐ సంజీవ్ అందజేశారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో జైలుశిక్ష

సత్తుపల్లి: ఐడీ పార్టీ కానిస్టేబుల్‌పై కత్తితో దాడి చేసిన నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ సత్తుపల్లి అదనపు జూనియర్ సివిల్ జడ్జి లావణ్య తీర్పు వెలువరించారు. ఏపీలోని చాట్రాయి మండలం చిత్తాపూర్‌కు చెందిన పాత నేరస్తుడు తిరువీధుల సురేంద్ర కొన్నాళ్ల క్రితం సత్తుపల్లిలో కనిపించగా కానిస్టేబుల్ నరేష్ పట్టుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో కత్తితో దాడి చేశాడు. ఈమేరకు సురేంద్రను రిమాండ్‌కు తరలించగా.. కానిస్టేబుల్‌పై దాడి, ఇతర కేసుల్లో జైలుశిక్ష విధించారు.